
**నవంబర్ రాత్రి అవటంవల్ల, కిటికీ సందుల్లోంచి, వెంటిలేటర్లలోంచి చల్లగాలి దూరి గజగజలాడిస్తోంది. దుప్పటిని మరింత గట్టిగా బిగించి, కళ్ళు మూసుకుని పడుకున్నాను.**

# నటభూషన్

శివం

ఎంత వద్దనుకున్నా కిందటిరాత్రి మా శ్రీమతి అన్న మాటలే గుర్తుకు వస్తున్నాయి.

తను పిల్లలతో వేగలేకుండా వున్నదట. కొన్నాళ్ళు హాయిగా పుట్టింటికి వెళ్ళి వుంటానన్నది. ససేమిరా వీల్లేదన్నాను. వెళ్ళాలంటే పిల్లల్ని కూడా తీసుకెళ్ళమన్నాను. పిల్లలతో వెళ్ళడం తనవల్ల కాదంది. అయితే మానెయ్యమన్నాను. మగాళ్ళ వుపన్యాసాలు. కథలు కాకరకాయలు అన్నీ బూటకాలనీ వాళ్ళ దౌర్జన్యం రోజు రోజుకీ మితిమీరిపోతోందనీ వాళ్ళంతా నటరాక్షసులు అనీ వాపోయింది. అదంతా వట్టి దుష్ప్రచారమనీ. కిట్టనివాళ్ళు చెప్పే మాటలనీ కొట్టిపారవేశాను. పోనీ వూళ్ళోనే వున్న చెల్లెలుగారింటికి వెళ్ళి నాలుగు రోజులుండి వస్తాననీ. తనకూ మనసుందనీ కోరికలున్నాయనీ. మనిషినేననీ గుర్తు చేసింది. మరి పిల్లలో అన్నాను. షరా మామూలే. మీ వద్దనే వుంటారు అన్నది. దీనికి కూడా వప్పుకోకపోతే నాతో సహా ఆడది మగవాళ్ళపైన వేసిన నటరాక్షసులు అనే అభాండం అట్లాగే వుండిపోతుందనే భయంతో. కొంచెం మెత్తబడి. ఆమెయందు నాకున్నటువంటి ప్రేమను వ్యక్తంచేసేసేను! అంతే తెల్లవారే లేచి ఒలింపిక్ స్పీడ్‌తో వంటచేసి పారేసి. తనింత తిని. లోకల్ ట్రయిన్ ఎక్కి వాళ్ళచెల్లెలుగారింటికి వెళ్ళిపోయింది పిల్లలను ముగ్గురినీ నా పాలపడేసి. ప్రొద్దున్న పదిగంటల నుంచీ రాత్రి తొమ్మిది గంటలవరకు చేతనయినట్లు



వాళ్ళను సముదాయించి. చలి గుప్పెట్లో యిరుక్కొని. అర్ధరాత్రికి నిద్రపోయేను:

తలుపు చప్పుడవుతోందటంతో. విసుక్కుంటూనే దుప్పటిని తొలగించి. గడియారం వైపు చూసేను. తెల్లారు ఝాము 2-30 గంటలు. బంగారంలాంటి నిద్ర నాశనమయిపోయింది. లేచి. తూలుకుంటూనే వెళ్ళి వీధి తలుపు తీసేను. కట్టలు తెంచుకుని వచ్చే కోపాన్ని అణచుకుని. మళ్ళీ వచ్చి మంచంమీద కూర్చున్నాను.

వీధి తలుపు గడియవేసి. చెప్పులు ఓ మూల విడిచేసి-

"ఇంకా మేలుకునే వున్నారా? భోజనం చేసేరా. లేదా అసలు!" అని ఆప్యాయంగా అడుగుతూ గదిలోకి ప్రవేశించింది శ్రీమతి. కోపం పెల్లుబుకుతోంది. తమాయించుకున్నాను. అయినా మాటలు బయటకి వచ్చేశాయి "సినిమా ఎప్పుడు వదిలారు?నువ్వు యింటికి ఎప్పుడొస్తున్నావ్?"

"పాడు సినిమా నాకిష్టంలేదసలు.

టిక్కెట్లు తెప్పించేశానంటే. సరేనని మా చెల్లెలుతో కూడా వెళ్ళాను. సినిమా నా మొహంలా ఉంది. నా లాం టి వాళ్ళు వెళ్ళక వెళ్ళక వెళితే, బావుండి చస్తుందేమిటి? "అయ్యో నారాతా!"అన్నది మూతి మూడు వంకరలు తిప్పుకుంటూ.

"నేను అడిగింది అదేనా? ఆలస్యం అయిందేమిటి అంటున్నాను!" అన్నాను గొంతులోకి అథారిటీ అనుకోకండా తెచ్చిపెట్టుకుని.

"పాడుసినిమా ఎప్పుడో వదిలేసేరండి. దారిలో కారు పాడయిపోయింది. అది రిపేరు చేసుకుని వచ్చేసరికి యీ వేళయింది. నన్నేం చేయమంటారు చెప్పండి! నేనెంత పెందరాడే వద్దామనుకున్నా ఆ పాడుకారు అట్లా ట్రబులిచ్చేసింది దారిలో అర్ధాంతరంగా... లేకపోతే...."

# స్మృతి

ఫుట్‌పాత్ పక్కన
పాత చెప్పు చూసినా
పగుళ్ళు వారిన 'బూటు' చూసినా
సుదీర్ఘ ప్రయాణాలు గుర్తుకొస్తాయి!
అనుభవాలతో పండి
శ్మశానానికి చేరలేక
దారి పక్కనే కవిపించిన
దౌర్భాగ్యజీవి స్ఫురిస్తాడు!

—సౌభాగ్య

శ్రీమతి చెప్పే వివరాలన్నీ నా చెవిలోకి ఎక్కడం మానేశాయి. కోపంతో లేచి నుంచుని దండెంమీద పేర్చిన ఆవిడగారి బట్టల్ని చేతులోకి లాక్కుని. వాటిని చూపుతూ. "ఇవన్నీ ఎవరి బట్టలు?నీవేనా? వీట్టిని ఎక్కడ పారేసి పోయేవు? మగాడి లాగ ఎక్కడ బట్టలు అక్కడ పారేసిపోతే. వీటినన్నిటినీ ఏరి దండెం పైన పెట్టేను— తెలుసా? అదే మాదిరిగా నేను పారేసిపోతే ఎంత విసుక్కునేదానివో గుర్తుందా? అది సరే! నేను పక్క అరగంట యింటికి రావడం ఆలస్యమైతే. నానా యాగీ చేసేదానివి. నువ్విప్పుడు గంటన్నర లేటుగా వస్తే నినేన్నం చెయ్యాలంటావు?" అన్నాను వణికే గొంతుతో!

"చూడండి! అర్ధరాత్రి దాటింది .... అంకమ్మశివాలేమిటిప్పుడు?ఎవరైనా వింటే నవ్విపోతారు! హాయిగా పడుకోండి"

అంటూ బాత్‌రూంవైపు వెళ్ళిపోయింది.

మగవాడి మాటలంటే ఎంతో నిర్లక్ష్యం? వెనకే రెండు అడుగులు వేసి ఆవిడగారి మణికట్టును పట్టుకుని:

"మరేం ఫర్వాలేదుగాని. ముందీ సంగతి తేల్చు. నువ్వు అర్ధరాత్రి దాటేవరకు ఊరమ్మట తిరుగుతూవుంటే. యిక్కడ బిక్కు బిక్కుమంటూ ఎంత బాధ పడ్తున్నానో ఆలోచించావా అసలు? మిగతా మూడు రోజులు యిట్లాగే గడిపేద్దామనుకుంటే. చాలా పొరపాటు పడ్తున్నావన్న మాట! నేనింక మూడుగంటలు కూడా యీ కొంపను కనిపెట్టుకుని కూర్చోలేను. ఆ పని నీకు చెల్లిందేమో గాని నావల్ల కాదు అర్థమయిందా?" అన్నాను.

"అబ్బ! చెయ్యివదలండి....నొప్పిపెడుతోంది." అంటూ అరుస్తూ విదిలించుకొనబోయింది.


"ఉహుఁ వదలను గాక వదలను. నేనెంత అవస్థ పడుతున్నానో నువ్వు గ్రహించేంత వరకు వదలను. నా పరిస్థితికి జాలిపడ్తున్నాననేటంత వరకూ వదలను." ఆవేశంతో అనేసి. తర్వాత నేనన్న మాటకి అర్థం తెలిసి నాలుక కరుచుకున్నాను.

బల్లపైన వో పక్కగా పడివున్న చిట్టితల్లి ప్లాస్టిక్ బొమ్మను అందుకుని. తల మీద నాలుగుదబదబా తగిలించింది శ్రీమతి. ఈ ఆకస్మిక సంఘటనకు విస్తుపోయి. మరుక్షణంలోనే మిగతా దెబ్బలను తప్పించుకోవాలని. బాక్సర్‌లాగ తలకు చేతులు అడ్డంగా పెట్టుకుని "శాంతా! ఏమిటది?" అన్నాను ఆశ్చర్యంగా.

శ్రీమతి సమాధానం చెప్పకుండా కిలకిలా నవ్వేసి. ఆ బొమ్మను బల్లపైన పారవేసి బాత్‌రూం లోకి చెంగున గెంతి లోపలినుంచి తలుపు బిగించుకున్నది.

ఈ ఆడవాళ్ళు ఎంతకైనా తగుదురు సుమా అనుకుంటూ అటూయిటూ చూసేను. బాత్‌రూం పక్కనే వున్న ప్లాస్టిక్ మగ్‌లు రెండు కన్పించేయి. అవి ప్లాస్టిక్ బొమ్మకంటే మందంగాను గట్టిగాను వున్నాయి. వాటిల్లో నుంచి ఒక మగ్ తీసుకుని. బెడ్‌రూంలోకి వచ్చి. శ్రీమతి రాకకోసం ఎదురుచూస్తూ. మంచం చివరనే కూర్చున్నాను.

శ్రీమతి వస్తున్న నవ్వును ఆపుకుంటూ పెద్దలైటు తీసేసి. బెడ్‌లైట్ వేసి మంచం దగ్గరకు రాగానే. నేను నా చేతిలోని 'మగ్'ను ఆమెగారికి అందిస్తూ. "మగ్ చాలా గట్టిగా వుంది. దాంతో కొట్టు. దెబ్బలు బాగా తగుల్తాయి. నీ కోపం కూడా చల్లారుతుంది" అన్నాను.



"చాల్లెండి సంబడం" అంటూ 'మగ్'ను లాక్కొని, మంచం కిందికి గిరాటేసి, మంచాన్ని ఎక్కేసి, క్షణంలో దుప్పటిని వంటి నిండా కప్పేసుకుని పడుకున్నది. మొహాన్ని కప్పి వున్న దుప్పటిని లాగబోయేడు తను. ఆవిడ దుప్పటిని గట్టిగా పట్టుకుని, చుట్టుకుని వుండటం వల్ల, దుప్పటి లాగలేమ. దుప్పటిలోని శ్రీమాత్రం పగలబడి వచ్చే నవ్వును ఆపుకొనడానికి విశ్వ ప్రయత్నం చేస్తూన్న ధ్వనులు మాత్రం వినవస్తున్నాయి.

(ఇక్కడ కట్ చేసి కొంచెం వెనక్కి వెళ్ళదాము)

అంతకుముందు రోజు రాత్రి యిదే మాదిరి సీన్. శ్రీమతి దుప్పటి కప్పుకుని నిద్రను నటిస్తోంది. ఆవిడను ప్రసన్నం చేసుకోవాలని అనేక వ్యర్థప్రయత్నాలు చేస్తున్నాడు యీ అమాయకపు హీరో.

ఉన్నట్లుండి, అవతలివైపు తిరిగి పడుకుంటూ, "అబ్బ! నాకు నిద్రొస్తోంది. అర్ధరాత్రి హాయిగా పడుకోక ఏమిటీ గోల" అనేసింది శ్రీమతి.

"అదికాదు నీతో చాలా ముఖ్యమైన సంగతి ఒకటి చెప్పాలి. ఆ దుప్పటి నుంచి తల యివతల పెట్టు కాస్త" అన్నాను.

"మీరు చెప్పే సంగతేదో చెప్పరాదూ... నా ముఖమంతా బయటికి దేనికి? మీరు చెప్పండి. నాకు విన్పిస్తుంది" అన్నది.

"మన బట్టల కొట్టాయన పట్టు చీరలు తెప్పించేడుట." అన్నాను గట్టిగా.

"ఓస్ యింతేకదా! పండగ వస్తోంది గనక చాలామంది ఆ పని చేస్తున్నారులెండి" అనేసింది చాలా తేలికగా.

కొంచెం ఆలోచించి, "ఇంతే ననుకున్నావేమిటి? మరో మంచి కబురుందిలే" అన్నాను.

"పడుకుని. తెల్లారే చెప్పండి నాకు నిద్ర ముంచుకొచ్చేస్తోంది" అంటూ దుప్పటిని మరింత దగ్గరగా లాక్కొని పడుకుంది.

ఎట్లాగైనా సరే శ్రీమతిని ప్రసన్నం చేసుకోవాలని "లేదు, యిప్పుడే చెప్పేస్తా. లేకపోతే నాకు నిద్రపట్టి చావదు. అతను ఇన్‌స్టాల్‌మెంటులో చీరలు యిస్తాను పట్టుకెళ్ళమన్నాడు" అనేసి నేను నా దుప్పటి కప్పుకుని యిటు తిరిగి పడుకుని నిద్రను అభినయించసాగేను.

ఆవిడ ఆలోచనలు ఏమిటో నాకు తెలియవు. నా ఆలోచనలు మాత్రం ఆవిడ ప్రసన్నం కాకపోతే మరే పాచిక వెయ్యాలా అని. అయిదు నిమిషాలు ఏ నవలా రచయితా వర్ణించలేని సస్పెన్స్‌తో గడచిపోయేయి. నేను నిద్రపోయేనని అనుకుని

# శేషేంద్రజాలం

ఆరే అరచేతిలో రేఖలు
చూస్తావెందుకు
కనుబొమల మధ్య
రెండు లోయల్లా నుల్చొవున్న
ఆ గీతల్ని చూడు
కనుపిస్తుంది మనిషిలో
విరుచుకుపడుతున్న
దుఃఖసాగరం....

—శేషేంద్ర

ఆవిడ నిద్రపోతే పాచికలు నీళ్ళపాలేనని భయమేసి మేలుకుని వున్నట్లు, అలవాటయిన పొడిదగ్గు ఒకటి దగ్గేను. ఆవిడేమీ చలించలేమ. ఈ ఆడవాళ్ళంత కఠిన హృదయులు మరోరు వుండబోరని నిర్ణయానికి వచ్చేసి, నేనే అన్నాను. "ఇదిగో నిద్రపోతున్నావా?" అని.

"లేదు ఆలోచిస్తున్నాను." అన్నది శ్రీమతి మెల్లిగా.

నా పాచిక పారి ఆవిడ దోవలోకి వస్తున్నందుకు అమందానంద కందళిత హృదయారవిందుండనై, "ఏమిటో అంత ఆలోచన ఈ చెవిలో కూడా పడవెయ్యి. ఆనందిస్తాను." అన్నాను ప్రక్కకు వత్తిగిల్లి.

"నేవింక యీ యింట్లో వక్క రోజు కూడా వుండలేను. ఓ పదిహేను రోజుల పాటు మా వూరెళ్ళవస్తా" అన్నది.

వేసవి కాలంలో ఎవరో వట్టివేళ్ళ విసనకర్రతో విసిరినంత హాయిగా అన్పించింది. నేను వ్రాద్దామనుకుంటూ వ్రాయకుండా వుండిపోయిన అద్భుతమైన నవలా రాజాన్ని యీ సమయంలో ప్రారంభించి, సగమైనా లాగించెయ్య వచ్చును అనే ఆలోచన వచ్చేసరికి!

చిన్న నిట్టూర్పును కావాలనే వదిలి, "సరే అట్లాగే వెళ్ళిరా!" అన్నాను అయిష్టాన్ని కొంచెం గొంతులో మిళాయించి.

అడగ్గానే వప్పుకున్నందుకు కరెంటు తగిలి షాక్ అయినట్లుండి "నిజంగానే" అన్నది తను కొంచెం యిటువైపుగా తిరిగి, ఆశ్చర్యంగా

"అవును నిజమే. మహారాణిలాగ వెళ్ళిరా ఇక్కడ పాపం నువ్వు వొక్కర్తెవూ ఈ పిల్లలతో చేసుకోలేక నానా హైరానా పడిపోతున్నావు కూడాను. ఇన్నాళ్ళూ" అన్నాను సానుభూతిని వలకపోస్తూ.

మొహం మీద నుంచి దుప్పటిని తీసేసి "అంటే మీ వుద్దేశం?" అని అడిగింది.

ఆ ప్రశ్న అడగడంలో ఆవిడ ఉద్దేశమేమిటో నాకేమీ బోధపడి ఏడవలేదు. ఇక నా వుద్దేశం స్పష్టంగా తెలుస్తోనే వుందిగా!

ఆమెగారి మొహం చూస్తేనయినా ఆవిడగారి ఆలోచనలు స్పష్టంగా అర్థమవుతాయనే ఆశతో, నేనూ మొఖానికి కప్పుకున్న దుప్పటిని తొలగించి, ఆవిడ మొహంలోని భావాల కోసం వెతకసాగేను, ఆ మసక వెల్తురులో.

"అంటే ఏముంది? నువ్వు హాయిగా పిల్లల్తో పదిహేను రోజులు మీ వూరెళ్ళితే, నేనిక్కడ వంటరిగావుంటూ, వీలయినప్పుడల్లా హాయిగా రాసుకుంటూ వుంటాను." అన్నాను.

"ఊహు! పిల్లలను కూడా నాతో తీసుకెళ్ళడం కుదరదు. వాళ్ళను యిక్కడే వుంచేస్తాను. వాళ్ళు కూడా అక్కడికెందుకూ?" అన్నది.

"అంటే ఈ పిల్లలను నేనిక్కడ ఆడిస్తూ, పాడిస్తూ వుంటే నువ్వు వక్కర్తెవూ మీవూరెళ్ళతావన్న మాట" అన్నాను ఆశ్చర్యంగా.

"మరంతేగా దానర్థం" అని నవ్వేసింది.

"అయితే నువ్వు ఎక్కడికీ వెళ్ళడానికి వీల్లేదు. ఇక్కడే వుండు" అన్నాను కొంచెం గట్టిగానే.

"అంటేఈ మగాళ్ళు చెప్పేదానికీ, చేసేదానికీ పొంతన వుండదన్న మాట" అనేసింది కొంచెం విసుగ్గా.

"ఏమో, నువ్వేమైనా అనుకో. ఈ పిల్లల్ని సమదాయించడం నావల్ల కాదు."

"వక్క పదిహేను రోజులే కదండీ! చంటిదానికి మీరు పాలివ్వాలా, పెట్టాలా? చక్కగా అన్నం కూడా తినేస్తోంది"

"ఉహూ! పదిహేను రోజులు కాదు. పదిహేను గంటలు కూడా నా వల్ల కాదంటే కాదు అంతే."

"మరి యీ నాలుగేళ్ళనుంచీ నేను వళ్ళు ముక్కలు చేసుకుని రాత్రింబగళ్లు చాకిరీ చెయ్యడం బాగుందేం? వక్కరోజంటే వక్కరోజు నాకు విశ్రాంతి దొరికిందా? బానిసకంటె హీనంగా చాకిరీ చేస్తున్నానే. ఎంత జాలి లేదండీ మీ మగాళ్ళకు." అని దుప్పటి మళ్ళీ తలకు చుట్టుకుని, అవతలకు తిరిగి పడుకుంది.

నేను ఆలోచించేను. ఆవిడ చెప్పిందాంట్లో కొంచెం నిజం లేకపోలేదు. కాని యీ వానర మూకను నామీద పడేసి పదిహేను రోజులు వెళ్ళిపోతాననడం దారుణాతి దారుణం. అంచేత రాజీ మార్గం ఏదైనా ఆలోచించాలి అనుకుని, కాస్సేపు

ఆలోచించి. "చూడు శాంతీ, యీ వూళ్ళో మీ చెల్లెలు వుందన్నావు కదూ?" అన్నాను.

"ఉంటే వుంది దానిసంగతి మీకెందుకూ యిప్పుడు?" అని కోపంగా సమాధానం యిచ్చింది.

"చూడు ఆవిడ పాపం నిన్నెన్నోన్నిసాగ్లు సెలవుల్లో వాళ్ళయింటికొచ్చి వుండమన్న దని చెప్పేవు కదా. పైగా ఆవిడకు మన పిల్లలంటే ఎంతో ముచ్చట అని కూడా అన్నావు."

"ఊ, అయితే. వీళ్ళందరితో వాళ్ళింటికి వెళ్ళమంటారా నన్ను. ఉహూ నేనెక్కడకూ వెళ్ళను. ఇక్కడే యీ యింట్లోనే మీ సేవచేస్తూ తరించిపోతాను."

"చూడు నువ్వు కావాలనుకుంటే రేపు పొద్దున్నే వాళ్ళయింటికి వెళ్ళి నాల్గురోజులుండిరా. నాకు ఎట్లాగా, రేపటి నుంచి నాల్గురోజులు సెలవులిచ్చారు" అన్నాను శ్రీమతి భుజాన్ని నిమురుతూ.

"చటుక్కున దుప్పటి ముసుగు తొలగించి, చంద్రబింబంలాంటి మొహాన్ని బయటకు పెట్టి. "నిజంగానే వెళ్ళి రమ్మంటారా?" అన్నది.

"అవును. నిజంగానే వెళ్ళిరా. నువ్వు వూళ్ళోనే వుంటావు గనక, అంత భయం లేదు. పిల్లల్ని నేను యీ నాల్గు రోజులు ఎట్లాగో చూసుకోగల్ను. అంతగా అవసరం వుంటే టెలిఫోన్ చేస్తా." భుజాల మీద నుంచి చెక్కిళ్ళమీదకు వేళ్ళను మారుస్తూ.

"ఏమిటో అనుకున్నానుగాని, నిజంగా మీరెంత మంచివారండీ! రేపు పొద్దున్నే వెళ్ళొస్తాను అయితే. నాల్గురోజుల పాటు చీకూ చింతా లేకండా హాయిగా. సినిమాలు మ్యూజియమ్‌లు, పార్కులు, ఎగ్జిబిషన్‌లు, అన్నీ చూసేస్తా." ఆనందంతో వుక్కిరి బిక్కిరి అవుతూ ఏమేమిటో చెబుతోంది.

ఎదురుచూస్తూన్న సమయం రానే వచ్చింది. సమయం జారిపోకండా అనేక

# లోలోపల....!

పదగ్గదిలో
జవరాలిని తాకబోతే
వయసంటోంది
సిగ్గు! సిగ్గు!
బోరుకొట్టి బారుకెళితే
మనసంటోంది
పెగ్గు! పెగ్గు!

—పాయసం సుబ్రహ్మణ్యం

రకాల అభయం యిచ్చే మాటలు చెబుతూ జాగ్రత్తపడ్డాను. ఇదండీ ఒక బలహీనమైన క్షణంలో నేను చేసిన పొరబాటు.

[ఇక్కడ కట్ చేసి మర్నాటి మధ్యాహ్నం 4 గంటలకి వెళదాము]

పార్కులో కాశ్మీర్ తివాసీ పరిచినట్లు పచ్చిక కన్నులకింపుగా పరుచుకునివుంది. ఆ పచ్చికపైన అక్కడక్కడ పడివున్న ఎండుటాకులన్నీ పోగుచేసి బుజ్జిగాడు, బాచిగాడు రెండు చేతుల్తో చిట్టితల్లి తలపైన వదుల్తూ, 'వాన, వాన' అని చప్పట్లు చరుస్తున్నారు. నేలపైన కూర్చునివున్న చిట్టితల్లి తల ఎగరవేస్తూ వెర్రిగా నవ్వుతూంది.

వాళ్ళ పాటున వాళ్ళు ఆడుకుంటూంటే బంగారపు కణికలు. పలకరించేరూ రాక్షసి మూక! అందుచేత వాళ్ళవైపో చిర్నవ్వు వడేసి, ఫ్లాస్కులోని కాఫీని కప్పులోకి కొద్దిగా వంచుకుని తాగేసి, భద్రంగా మూత పెట్టి, ఫ్లాస్కును మళ్ళీ చేతిసంచీలో పెట్టేసి, సిమెంటు బెంచీని ఆనుకుని, సారోయాన్ కథల పుస్తకాన్ని చేతిలోకి అందుకున్నాను.

మొగటి కథలో మొదటి పేజీ పూర్తి చేసేనో లేదో, నాలుగేళ్ళ కుర్ర వెధవ-బుజ్జిగాడు, గెద్దలాగ వచ్చి నా పక్కన వాలిపోయి,

"నాన్నా! టిఫిన్ తిందామా?" అన్నాడు.

ఒక్కసారి వాడివంక నిశితంగా ఎగాదిగా చూసేను. వాడు ఆకలితో నన్నే తినేసేట్లు చూస్తున్నాడు. ఈ కుర్ర వెధవలకి ఏమీ తోచకపోతే ఆకలి గుర్తువస్తుంది కాబోలు

"ఒరేయి! మనం ఇక్కడికొచ్చి అర గంట కూడా కాలేదు. ఇక్కడికి అసలు మనం ఎందుకొచ్చేం? ఆడుకోడానికా, తినడానికా?" అన్నాను.

ఎప్పుడొచ్చేడో బాబిగాడు బుజ్జిగాడి వెనకాలే నిలబడి వున్నాడు. బుజ్జిగాడు సందేహిస్తున్నాడు ఏం సమాధానం యివ్వాలా అని. బాబిగాడు తడుముకోకుండా "తినడానికి" అనేసేడు

"అక్కడ స్లైయిడు వుంది చూడండి. అది మీలాంటి పిల్లలు ఆడుకోడానికి ఏర్పాటు చేసేరు. కాస్సేపు దాని దగ్గరకు పోయి ఆడుకోండి చక్కగా. ఓ అరగంట తర్వాత మీ అందరికి టిఫిన్ పెడ్తాను" అన్నాను పాకుకుంటూ వస్తున్న చిట్టితల్లి నే చూస్తూ.

"నాకు ఆకలివేస్తోంది నాన్నా" అన్నాడు బాబిగాడు కదలకుండా.

"ఒరేయ్ బాబిగా! మనం మాఇంటికి యింట్లోంచి బయలుదేరబోయే ముందు మీ అమ్మ కడుపు చల్లగా. ఆవిడ తయారు చేసివుంచిన చేగోడీలు, జంతికలు తిన్నామా లేదా?" అని అడిగాను.


"నువ్వూ అన్నయ్యా తిన్నారు నేనసలు చేగోడీలు తిననేలేదు."

"ఎందుకు తినలేదూ? ప్లేట్లో నీకూడా పెట్టేనుగా."

"మరే నేను నీ వంక చూస్తూ జంతిక తింటుంటే. నా ప్లేట్లోని చేగోడీలు బుజ్జిగాడు తినేశాడు."

"సరే కానీ. ఆనక వాడికి చేగోడీలు పెట్టకుండా వుందాం. మరి వెళ్ళి కాస్సేపు ఆ స్లయిడ్ దగ్గర ఆడుకోండి." అని వాళ్ళను పంపించేసరికి మైనర్ ఆపరేషన్ చేసినంత పని అయింది.

చిట్టితల్లి పార్కు బెంచీ పుచ్చుకుని లేచి నిలబడాలని ప్రయత్నిస్తో, లేవలేక చతికిలపడుతోంది. "ట్రయిచెయ్యి తల్లీ! మళ్ళీ



మళ్ళ ట్రయిచెయ్యి. మేమంతా నీలాగ ట్రయిచేసి యీనాడిట్లా యిక్కడ చతికిల బడ్డ వాళ్ళమే " అంటూ ప్రోత్సహించి. మళ్ళ పుస్తకంలో తలదూర్చేశాను.

ఎవరో సిమెంటు బెంచీ ప్రక్కకి వస్తూన్న అలికిడి అయి తలఎత్తిచూసేను. ఒక పూర్ణ గర్భవతి తన చంకనున్న సంవత్సరం పిల్లవాడిని నేలపైన దించి. తన ప్రక్కనే. కొంచెం ఎడంగా ఆసీనురాలయింది. చిట్టితల్లి కొంచెం దూరంలో వున్న ఇసకను తీసుకుని ఆనందంగా భోజనం చేస్తోంది.

"ఆ పాప మీ పాపేనా?"ఆవిడ ప్రశ్న. అవునన్నట్లు తలవూపి. పుస్తకంలో దూరిపోయేను.

"వద్దు తల్లీ. వద్దు ఇసక తినకూడదమ్మా" అంటూ చిట్టితల్లిని మందలించి "మీ పాప ఇసక తింటోంది." అంటూ నన్ను హెచ్చరించి. "ఛీఛీ నోట్లోంచి చెయ్యి తీసెయ్యి. తీసెయ్యమ్మా!" అంటూ లాలనగా అడిగింది.

పసిపిల్లలు ఆనందంగా ఆడుకున్నంతసేపూ. వాళ్ళు యిసకతిన్నా. గడ్డితిన్నా. వాళ్ళను 'డిస్టర్బ్' చెయ్యకూడదనే తత్వం నాది. కాని ప్రక్కనున్న ఆవిడతత్వం

## సూక్తి సుధ

ఉత్సాహో బలవానార్య
వాస్త్యుత్సాహాత్పరం బలమ్
సోత్సాహస్యాస్తి లోకేస్మి
న్నకించిదపి దుర్లభమ్॥

ఉత్సాహం కంటె మరొక బలం లేదు. ఉత్సాహవంతునకు ఈ లోకంలో పొందరానిది లేదు.

—వాల్మీకి రామాయణం

నాకు విరుద్ధమే కాకండా. నా తత్వాన్ని నన్నూ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చూసేసరికి గత్యంతరంలేక పుస్తకాన్నిఅక్కడే వదిలి. చిట్టితల్లి దగ్గరకువెళ్ళి దాని చేతిలోని ఇసకను లాగి నేలపైన పడేసి. జేబు రుమాలుతో దాని చేతిని. మూతిని తుడిచేసరికి. అది కోపంతో వెల్లకిలా నేలపైన పడుకుని. కాళ్ళూ చేతులూ నేలమీద బాదుకోసాగింది చిన్న కూనిరాగంతో. "తప్పు తల్లీ!" అంటూ దాన్ని తిన్నగా కూర్చోపెట్టి. వదలగానే మళ్ళ విరుచుకుని. వెల్లకిలా పడిపోయి. దీర్ఘం తీయసాగింది. స్కూల్లో నూ. కాలేజీలో నూ ఈ సమయాల్లో ఏం చెయ్యాలో చెప్పకపోవడం వల్ల దాన్ని అట్లాగే వదిలెయ్యడం మంచిదని వచ్చి. బెంచీమీద కూర్చుని, పుస్తకం తెరిచేను. రెండో పేజీ పూర్తిచేసి తలఎత్తి చూసేసరికి. గర్భిణీ స్త్రీ చిట్టితల్లి వద్ద కూర్చుని దాని చేతులు శుభ్రం చేయడం గమనించి. బాగుండదని లేచి చిట్టితల్లిని తీసుకుని వచ్చి బెంచీ మీద కుదేసి. చేతి సంచీలోని మిల్క్ బిస్కెటు పాకెట్‌లోంచి ఓ బిస్కెట్ తీసి దానికిచ్చి. అది తింటూండగా దానిని తీసుకెళ్ళి ప్రక్కనే వుంచిన తోపుడుబండిలో పడుకోబెట్టి వచ్చి ఓ చిన్న నిట్టూర్పు విడిచాను.

జంతికలు వాసన వెయ్యవచ్చు. చేగోడీలు వాసన వెయ్యవచ్చును. బిస్కట్లు కూడా వాసనవేస్తాయా? వేస్తాయికాబోలు్న. బుజ్జిగాడు. బాచిగాడు. రెక్కలు వున్నట్లు వచ్చి పక్కన వాలిపోయేరు.

ముందు బిస్కట్లు. ఆతర్వాత చేగోడీలు ఆ తర్వాత జంతికలు ఫలహారం చేస్తేగాని వాళ్ళు సంతుష్టి చెందేరుకారు.

"సరే యిక పోయి ఆడుకోండి-ఓ అర

RADEUS/BB/L/1-85

మరువలేని ఆ మధురమైన స్నేహం



చిన్నారి మనసులు కలసిన ఆ సంధ్యాకాలం కబుర్లు చెప్పుకొనేటప్పటి ఉల్లాసం. గంటలు క్షణాల్లా గడచిపోయిన ఆ సమయం. మదిలో నిండిన ఆ ఆనందం. జతగా పంచుకొని త్రాగిన జిల్లనిపించే లిమ్కా! రుచిలోని ఆ మాధుర్యం. ప్రతి మారూ లిమ్కా త్రాగినపుడు వస్తుంది కదూ జ్ఞాపకం?

లిమ్కా నిమ్మ రుచి సదా ఆనందపు అనుభూతి!

లిమ్కా
నిమ్మకాయ నీరులా మజా నిచ్చగల పానీయం
చల్ల-చల్లగా ఇస్తుంది

ARTIFICIALLY FLAVOURED. CONTAINS NO FRUIT JUICE OR FRUIT PULP.

గంట" అన్నాను.

"మేం కాఫీ తాగలేదు నాన్నా!" అన్నాడు బుజ్జిగాడు.

"అవును. తాగనే లేదు" అన్నాడు బాచిగాడు.

"వెధవల్లారా. బయటికి వస్తే చాలు ఆకలి పుట్టుకొస్తుందేరా?" అంటూ వకడికి ఫ్లాస్కు మూతలోను. మరోడికి ప్లాస్టిక్ గ్లాసులోను కాఫీపోసి. ఖాళీ ఫ్లాస్కును ఎడంగా నేలపైనే వుంచేను!

కాఫీ పూర్తిచేసేసి. మూత. గ్లాసు. నా చేతికి అందిస్తూ

"మేం వెళ్ళి ఆడుకోమా ఇంక" అన్నారు.

"ఆ....ఇంకేం లేవు తినడానికి. పోయి ఆడుకోండి. అన్నట్లు ఈ ఖాళీ గ్లాసు మూతలు రెండూ అక్కడ ఫౌంటెన్ దగ్గరకిపోయి కడుక్కురండి. జాగ్రత్త! ఆ కుండీలో పడకండి" అని హెచ్చరించి. పుస్తకంలో నేను ఇది వరకు చదివిన స్థలాన్ని గుర్తుపట్టి అందుకునేలోగానే. మా వెధవలు రేసుగుర్రాల్లా దూక్కుంటూ వచ్చి ఫ్లాస్కును. సిమ్మెంటు బెంచీకివెళ్ళి కొట్టుకునేంత గురిగా. తన్నేసేరు.

ప్రక్కన గర్భిణీ స్త్రీ వుండిపోయింది. లేకపోతే వాళ్ళ చెవులకి గట్టిగా 'కీ'యిచ్చి భరతనాట్యం చేయించి వదిలేవాడిని.

"పోనీండి....పాపం పిల్లలు! ఇద్దరూ మీ వాళ్ళేనా?"

"ఆ యిద్దరూ. ఈ తోపుడు బండీలోది కూడా నా స్వంతమేనండి. పోయి ఆడుకోండి నాయనలారా! ఇంకేంలేవు పగల కొట్టడానికి" అనేసరికి వాళ్ళుమళ్ళీ స్లయిడ్ దగ్గరకి పరుగెత్తారు. నేను పగిలిపోయిన ఫ్లాస్కును పార్కు చివర పారేసివచ్చి. బెంచీపైన చతికిలపడ్డాను. ఫ్లాస్కు పోయి నందుకు నాకు దిగులుగా లేదు. మళ్ళీ కొనుక్కోవచ్చును. కాని మా ఆవిడ నన్ను నా అజాగ్రత్తను ఎత్తి పొడుస్తుందనే బాధ ఎక్కువగా వుంది.

"వాళ్ళను మీరు ఎంతో జాగ్రత్తగా సముదాయించుకు రావడం చూస్తుంటే ముద్దొస్తోంది. మా వారు న్నారు. ఈ చంటి పిల్లాడిన్ని వక్క గంట సముదాయించలేరు. ఇంతకూ అదృష్టం వుండాలి దేనికైనా." అన్నది ఎక్కడికో చూస్తూ ఆ యిల్లాలు.

పూర్ణ గర్భిణి అయిన స్త్రీ పాపం చంటి పిల్లాడిని తీసుకుని పార్కుకి వచ్చిందంటే. ఆ మొగుడు ఎంత దుర్మార్గుడయివుండాలో అన్పించింది. మా శ్రీమతికి యిటువంటి మొగుళ్ళు వున్నారీ ప్రపంచంలో అని చెబితే. నన్ను చూసి ఎంత గర్విస్తుందో అని అనుకుని. ఆవిడతో ఏదో వకటి మాట్లాడకపోతే బావుండదని. "ఎప్పుడను కుంటున్నారో?" అన్నాను నెమ్మదిగా.

"ఇంకో మూడు. నాలుగు వారాలు పట్టచ్చునన్నారు డాక్టర్‌గారు-వుహ్!హు" అంటూ మూలిగింది ఆ మహాతల్లి.

ఆ శబ్దాలు వినడానికి ఎంతో బావున్నాయి. మామూలు శబ్దాలు కావవి. జీవంతో కూడిన శబ్దాలు. జీవికోసం చేసే నాదాలు. జీవిని ఆహ్వానించే స్వాగత గీతాలు.

"అవును. పాపం....యీ ఆఖరి వారాలు మరీ బాధాకరం.... నాకు తెలుసు." సానుభూతిని వలకబోస్తూ అనుకోకండానే అనేసేను. కాని తర్వాత తెలుసుకున్నా.... ఎంతో అనుభవం వున్నట్లు.. నేనే ప్రసవ వేదన అనుభవించినట్లు.... ఏం మాటలవివి: వెంటనే నాలిక కొరుక్కుని. "కిందటేడాదే మా ఆవిడ ప్రసవించిందిలెండి. అదీ సంగతి" అనేసి ఓ వెకిలినవ్వు వదిలి పక్కనే పడివున్న పుస్తకాన్ని అందుకున్నాను మళ్ళీ.

ఎవరో గర్భిణీ స్త్రీ పరిచయస్థురాలిలాగ వుంది. కొంచెం దూరంలో నిలబడి గర్భిణీ స్త్రీని కుశల ప్రశ్న లడుగుతోంది. మరింకాస్సేపట్లో ఆ చాలీచాలని బెంచీపైన ఆవిడ కూడా కూర్చోవచ్చును. మర్యాదగా వుండదని లేచి. నా చేతి సంచీని తీసుకుని కొంచెం ఎడంగా వున్న మరో సిమెంటు బెంచీపైన కూర్చుని. నేను వ్రాయవలసిన వుద్గ్రంథాన్ని గురించి ఆలోచనల్లోకి జారిపోయాను. అవును త్వరగా రాసేసి పంపిస్తే పత్రికలవాళ్ళు కళ్ళకద్దుకుని సీరియల్‌గా వేస్తారు. డబ్బుకి డబ్బు. పేరుకు పేరు దక్కుతాయి. నెలల తరబడి పాఠకులు "సస్పెన్సు"తో వుక్కిరి బిక్కిరి అయిపోతూ వుత్తరాలపైన వుత్తరాలు వ్రాసేస్తూ వుంటారు. ఆ తర్వాత ఎవరో పబ్లిషర్ పుస్తక రూపంలో తెస్తాడు. అదృష్టం బావుంటే సినిమావాళ్ళు కూడా ఫిలిమ్‌కి రైట్సు అడగవచ్చును. అవును. యిలా నాల్గురోజుల సెలవుల్ని వృధా చెయ్యకూడదు ఎట్లాగైనా సరే యివాళే 'శుభం' అని నవలను ప్రారంభంచెయ్యాలి ఆలస్యం చెయ్యకూడదు. వక్కక్షణంకూడా వృధా చెయ్యకూడదిక. ఉక్కిరి బిక్కిరి అయినట్లయి లేచి నిలబడ్డాను. పుస్తకాన్ని సంచీలో సర్ది. సంచీని భుజానికి తగిలించుకుని తోపుడుబండీ వద్దకు వచ్చేను. మా బుజ్జిగాడు. బాబిగాడు దానికోసమే ఎదురు చూస్తున్నట్లు ఎగురుకుంటూ వచ్చేసేరు. బావుండదని గర్భిణీ స్త్రీ వైపోసారి సెలవు తీసుకుంటూన్నట్లు చూసి తోపుడు బండీని తోసుకుంటూ పార్కు బయటికి వచ్చేను— వెనకాలే బుజ్జిగాడు. బాచిగాడు అనుసరిస్తూ వుండగా!

బుడగలు అమ్మేవాళ్ళను. పాప్‌కారన్. పల్లీలు అమ్మేవాళ్ళను. బస్‌లను. లారీలను రిక్షాలను తప్పించుకుంటూ. అభిమన్యుడు లాగ తోపుడు బండితో ముందుకు వెళుతూంటే బుజ్జిగాడు. బాచిగాడు. "నాన్నా. కాఫీ హోటలు." "నాన్నా! మిఠాయిలు." "నాన్నా! జామకాయలు అంటూ రకరకాల పదార్థాలు కన్పించినప్పుడల్లా. నన్ను వెనక్కు లాగుతూండగా. ఎట్లాగైతేనేం వో ఫర్లాంగు నడిచేం. బాచిగాడు వుండుండి. "నాన్నా! కాళ్ళు నొప్పులు! నేను తోపుడు బండిలో కూర్చుంటా" అన్నాడు.

"ఒరేయి! ఇది చిన్న పిల్లలకురా! గేదెమూడలా వున్నటువంటి వాళ్ళకి కాదురా! కాళ్ళున్నాయి కదరా. హాయిగా నడువు" అన్నాను.

## తేడా

నాడు
కన్నవారే
అమ్ముకున్నారు
"శుల్కం" కోసం.
నేడు
అ కన్నవారే
ఎదురిచ్చి
వదిలించుకుంటున్నారు
వరకట్నం పేరుతో
నాటి కన్య
మారక విలువగల
ముడిపదార్థం!
నేటి కన్య
వర్తమాన దుస్థితిని
"ఖర్మ" గా తలపోస్తూ
చైతన్యం లోపించిన
కుంపట్లో బొగ్గులా
మండి మాడిపోతున్న
జడపదార్థం!

—ప్రభావతి

"చిట్టికి కాళ్ళు నొప్పయిగా దాన్ని కాస్సేపు నడవమను. నేను కూర్చుంటా అందులో." అన్నాడు. "తప్పురా నాయనా! నీకు యింటికి వెళ్ళగానే తాయిలం పెడతాను. నడవరా" అన్నాను. "ఊహూ. ఇప్పుడే పెట్టు." అన్నాడు.

"ఇంట్లో వుంది నడు. లేకపోతే చెవులు మెలేస్తా" అన్నాను కొంచెం కోపంగా. అంతేనండి ఉన్న పళాన రోడ్‌కి అడ్డంగా పడుకుని మూర్ఛవాడిలాగ దొర్లసాగాడు. లేవదీసి నిలబెట్టేను. అనుకున్నట్టే పడిపోయేడు పూర్వం బళ్ళోకి లాక్కెళ్ళుతుంటే నేను యీ విద్యనే ప్రదర్శించేవాడిని. తర్వాత సత్యాగ్రహులూ, యింకా చాలా మంది యీ విద్యను ప్రదర్శించ సాగేరనుకోండి. బజార్లో 'టియర్ గేస్' అమ్మనందుకు విచారించి. చంటిదాన్ని భుజాన వేసుకుని. బాచిగాడిని బండీలో ఎక్కనిచ్చి. బుజ్జిగాడిని బండీని నెమ్మదిగా నడిపించమన్నాను. చిట్టి తల్లి బొటనవ్రేలు చీకుకుంటూ. నా భుజంపైన తల వాల్చి రోడ్ మీద వింతలు చూస్తోంది. బుజ్జిగాడు తోపుడు బండిని కాస్సేపు యమ స్పీడ్‌గానూ మరి కాస్సేపు నిదానంగాను నడిపిస్తూ ఎన్నో ప్రయోగాలు చేస్తున్నాడు "ఒరేయ్! బండీని పడెయ్యవద్దు. బాచిగాడి కాళ్ళూ చేతులు విరుగుతాయి." అని హెచ్చరిస్తూ 'ఒమర్ ఖయాం బార్‌ను' చూసి త్వర త్వరగా ముందుకి వెళ్ళబోతూంటే. అందులో అప్పుడే దూరబోతున్న "శర్మ. రావు"లు నా కళ్ళబడ్డారు. వాళ్ళ అదృష్టానికి అసూయపడుతూ, పిల్లల మధ్య యిరుక్కునిపోయి నా దౌర్భాగ్యానికి విచారిస్తూ. త్వర త్వరగా యింటి వైపు నడిచాను.

ఇల్లు చేరుకోగానే. బుజ్జిగాడికి. బాచిగాడికి. చిట్టితల్లిని కాస్సేపు ఆడించమని అప్పగించి కుక్కర్‌లో యిన్ని బియ్యం పోసి స్టౌమీద పడేసి. ఉదయం మిగిలిపోయిన చారును వేడిచేసి. నాలుగు అప్పడాలు కాల్చబోయి మాడ్చేసి. చంటిదానికి హార్లిక్స్ కలిపి హాల్లోకి వచ్చి. పడక కుర్చీలో నడుం వాల్చేను. వ్రాయబోయే నవలను ఎట్లా ప్రారంభించాలా అని ఆలోచిస్తూండగా. పక్కగదిలో నుంచి బుజ్జిగాడు కేక పెట్టాడు. "నాన్నా! చిట్టితల్లి ... నిలబడింది" ఉలిక్కిపడ్డాను. నిలబడిందో. కిందపడిందో సరిగ్గా వినపడలేదు నాకు. ఖంగారుగా అవతల గదిలోకి వెళ్ళేసరికి చిట్టితల్లి నేలపైన చతికిలబడి నవ్వుతోంది.

"లేమ్మా .... మళ్ళీ నుంచో .... నాన్న నాన్న చూస్తారు" అంటూ బుజ్జిగాడు చిట్టితల్లిని లాలిస్తున్నాడు

# నాగార్జున సాగరం

ఈ నాగార్జున సాగరం
పావని కృష్ణ పైన నవజీవన
ప్రస్రవంతి
బీటలు వారిన పలనాడుకు ఓయాసిస్సు
సుక్కిన పంటల పాలిట నవోషస్సు
ఈ నాగార్జున సాగరం
బీడు వారిన భూములకు ప్రాణశక్తి
రైతుల ఎదలలో నవోదయ దీప్తి
ఆంధ్ర తెలంగాణాలను కలిపిన
స్నేహమయి.

—ఎం. ప్రకాశ్‌బాబు

"నాన్న చిట్టి స్వంతంగా నిలబడింది" బాచిగాడు వంత పాడేడు.


"ఏదమ్మా..నుంచో ....లేవాలి....వూ" అన్నాను బ్రతిమాల్తూ.

చిట్టితల్లి బ్యాలన్సు చేసుకుంటూ లేచి నిలబడి. నవ్వుతూంటే. బుజ్జిగాడు బాచిగాడు చప్పట్లు కొట్ట సాగేరు. అది మరుక్షణంలోనే కూలబడింది.

"సరే! మీ ఇద్దరూ రేపట్నుంచి దాన్ని కాస్సేపు నుంచో పెట్టి ప్రాక్టీసు ఇవ్వండి నాల్గు రోజులు పోతే నడిచేస్తుంది కూడాను" అని చిట్టితల్లికి రెండు బిస్కెట్లు పెట్టి హార్లిక్సు తాగించి. మిగతా ఇద్దరకూ ఇంత ఆవకాయ. పెరుగు వేసి అన్నం తిన్పించి భోజనాలు అయ్యేయనిపించేసి వాళ్ళను గదుల్లోకి పంపి చిట్టితల్లిని వుయ్యాలలో పడుకోబెట్టి నిద్రపుచ్చేసరికి ఎనిమిదయ్యింది. నా ప్రాణమూ గిలగిలలాడింది.

ఇల్లంతా ప్రశాంతంగా వుంది. కాసిని తెల్లకాగితాలు తీసుకుని టేబులు ముందు వేసుకుని బాల్ పెన్‌ను కొరుకుతూ నవలను ఏ వాక్యంతో ఎట్లా ప్రారంభించాలా అని మళ్ళీ ఆలోచనలోపడ్డాను. 'ఒమర్ ఖయ్యాం బార్'లో దూరుతున్న శర్మ. రావులు కళ్ళ ఎదుట మెదల సాగేరు. దుర్మార్గులు నేను లేకండానే ఆనందిస్తున్నారు యివ్వాళ. ఈ యింటి డ్యూటీ తగలకుండా వుంటే తనూ యీ పాటికి వాళ్ళతో ఏవే లోకాల్లోనో విహరిస్తూ వుండేవాడు. తనేదో గొప్ప త్యాగం చేస్తున్నట్లు యీ డ్యూటీ వేసుకుని. యిక్కడ బందీ అయిపోయేడు. ఖర్మం అంటే యిదికాక మరేమిటి? బి. ఏ. ఫస్టు క్లాసులో ప్యాసయి. బ్యాంకిలో రూ. 2000 తెచ్చుకుంటూ. పిల్లలను పార్కుకి తీసుకెళ్ళడం. ఫ్లాస్కును పగలగొట్టుకోవడం. వంటపని చేసుకోవడం. అప్పడాలు మాడ్చెయ్యడం. వంటరిగా బిక్కు బిక్కుమంటూ కూర్చోవడం— యిదంతా ఖర్మగాక మరేమిటి?

చటుక్కున ఆలోచన వకటి మెరిసింది. ప్రక్క గదిలోకి తొంగిచూసేను. పిల్లలంతా హాయిగా నిద్రపోతున్నారు. కోటు తొడుక్కుని. పర్సును జేబులో పెట్టుకుని. వీధి చివరవున్న బజారు వైపుకువెళ్ళి సిగరెట్ పెట్టె. అగ్గిపెట్టె. ఓ క్వార్టర్ మంచి రకం విస్కీ. పకోడీలు. కారపు బూందీ కొనుక్కుని. యీల వేసుకుంటూ హుషార్‌గా. గాలిలో తేలిపోతూన్నట్లు యింటికి వస్తూంటే. నవల ప్రారంభవాక్యం దొరికిపోయింది. ఇంకేముంది? రీలులోంచి దారం లాగినట్లు లాగడమే మొదటి ఛాప్టర్‌ను.



మరచిపోకండా దొరకిన వాక్యాన్ని మననం చేసుకుంటూ మూసిన యింటి తలుపులు తీసుకుని లోపలికెళ్ళి, సరంజామా నంతా టేబిలుపైన సర్ది, లోపల్నుంచి ఓ గ్లాసులో నీళ్ళు, మరో ఖాళీగ్లాసు తెచ్చుకుని అమృతాన్ని కొంచెం సేవించి, మధ్య మధ్య పకోడీలు, కారపుబూంది రుచిచూస్తూ పేరాల తర్వాత పేరాలను మెదడులో పేర్చుకుపోయి మొదటి ఛాప్టర్‌ను పూర్తి చేసేను.... మనస్సులోనే. అద్భుతంగా తయారయిపోయింది అనుకున్నవిషయం. ఇంక దాన్ని కాగితంపైకి ఎక్కించడమే. అసలు బాధంతా యిక్కడే వుంది.

అంచేత మరికాస్త అమృతాన్ని ఆపోసన పట్టి, బాల్ పాయింటు పెన్నును తీసుకుని అమితోత్సాహంతో కాగితాల పైన పడ్డాను

ఆలోచనలు పురకలెత్తుతున్నాయి. పెన్ను వాటిని పట్టుకోడానికి నానా అవస్థాపడుతోంది. కళ్ళు తేలిపోతున్నాయి మనస్సు ఎగిరి ఎగిరి పడుతోంది కాగితాలు నెమ్మదిగా నల్లబడుతున్నాయి వకటొక్కటే.

ఇంతలో టెలిఫోన్ మోగింది కోపంగా టెలిఫోన్ వైపు చూసేను. ఛీ! వెధవ డిస్టర్బెన్స్! లేవకూడదు ...అనుకుంటూ గ్లాసు వైపు చూసేను. ఖాళీగా ఉంది. సీసాలోది కొద్దిగా గ్లాసులోకి పంపిణీ చేసి నీళ్ళకోసం వెతుక్కుంటూండగా మళ్ళీ టెలిఫోన్ వైపు చూశాను. ఇంకా మోగుతూనే వుంది. గ్లాసును తీసుకుని టెలిఫోన్ దగ్గరకి వెళ్ళి కూర్చుని. "హలో! ఎవరది?" అన్నాను కొంచెం చికాగ్గా.

"హల్లో! నేనే! ఏం చేస్తున్నారు?" అన్నది శ్రీమతి.

లోపల బాధను అణచుకుని. "ఏం చేస్తాను హాయిగా నవల వ్రాసుకుంటున్నాను. నువ్వు హాయిగా, స్వేచ్ఛగా, ఆనందంగా వున్నట్లేనా? ఎక్కణ్ణుంచి?" అన్నాను.

"నాకేం! హాయిగా నిక్షేపంలా వున్నాను. ఇవ్వేళ మ్యూజియం చూసొచ్చేను. రాత్రి రెండో ఆట సినిమా చూస్తున్నాను. రేపు ఎగ్జిబిషన్‌కి వెళ్తాను. అది సరేగాని పిల్లలు ఎట్లా వున్నారు? అంతా భోజనం చేసేరా? చిట్టితల్లికి హార్లిక్సు పట్టేరా? జాడీలమీద మూతలన్నీ మళ్ళీ జాగ్రత్తగా పెట్టారా?" ప్రశ్నల వర్షం అవతల నుంచి.

"ఆ! అంతా భోజనాలు అయ్యిపడుకున్నారు. అన్నట్లు నీకు రెండు వార్తలు. ఒకటి శుభవార్త. మరోటి దుర్వార్త." అన్నాను— ఎదురుంగా వున్న గ్లాసులోని ద్రవాన్ని గొంతులోకి పంపిస్తూ. నీళ్ళు కలపడం మర్చిపోయినందువల్ల గొంతు ఛర్రుమని మండింది. ఉక్కిరిబిక్కిరయి దగ్గొచ్చింది.

"ఏమిటట్లా వున్నారు-ఏమయ్యింది?" అన్నది శ్రీమతి ఆదుర్దాగా.

"మరేంలేదు. నీళ్ళు మర్చిపోయాను" అని నోరు జారి, వెంటనే-

"అదే శుభవార్త అన్నాను కదూ. పలక మారింది ఎందుకో చెప్పనా?" అన్నాను.

"ఏమిటో పిచ్చిగోల: ముందు శుభవార్త చెప్పండి ఏమిటో!"

"చిట్టి ముండ ఇందాక తనంత తనే లేచి నిలబడింది" అన్నాను నీళ్ళగ్లాసు ఎక్కడ పెట్టేనా అని కళ్ళతోటే వెతుక్కుంటూ.

"ఏమిటి? మన చిట్టితల్లే నిజంగా తనంత తనే నిలబడిందా? ఎంతసేపు?"

"ఆ .... ఎంతసేపోనా! ఇట్టే నిలిబడి అట్టా పేడకడిలా కూలబడింది. రెండో సారి అయితే మన చిట్టి ముండ నిజంగా అయిదారు సెకన్లు నిలబడిందిలే. రోజూ మన బుజ్జాయికి ప్రాక్టీసు చేయించరా అని చెప్పేను"

"ఏమిటీ కథ-అందర్నీ ముండ గిండ అంటున్నారు? మీ పాత స్నేహితుల్తో ఎక్కడికైనా వెళ్ళొచ్చారా, లేక యింట్లోనే దుకాణం పెట్టేసేరా?" అంది పేగులు లెక్కపెట్టే ప్రయత్నంలో

"నా మొహానికి అదొక్కటే తక్కువ. స్నేహితులంతా హాయిగా పక్షుల్లా ఎగురుతూంటే నా ఖర్మకాలి పిల్లల్ని ఎత్తుకుని పార్కులమ్మట, బజార్లమ్మట తిరుగుతూను, వంటింట్లో కూర్చుని వంటా గింటా చేస్తూను అహోరిస్తున్నాను. ఇంతకూ నువ్వు హాయిగా వున్నావుకదా! నాకు కావలసిందదే !"

"అవును. దుర్వార్త అన్నారు. ఏమిటది? చెప్పండీ అది కూడా."

"ఆ ఏమీలేదు. ఇందాకా పార్కులో మన బుజ్జిగాడు. బాచిగాడు వకళ్ళనొకళ్ళు తరుముకుంటూ పరుగెత్తుకొచ్చి, ఫుట్‌బాల్‌ని తన్నినట్లు ఫ్లాస్కును తన్నేసేరు." అన్నాను.

"అయ్యో! అయ్యో! ముప్ఫయి రూపాయల ఫ్లాస్కు-కొని ఆర్నెల్లు కూడా కాలేదాయిరి? పిప్పి పిప్పి అయ్యిందా?" అన్నది ఆదుర్దాగా.


"ఆహా! నామరూపాలులేకండాపోయింది. పార్కు మూల పారేసి చేతులు దులుపుకుని వచ్చేను. నువ్వేం ఖంగారు పడకు. నువ్వు కులాసాగా వున్నావు కదా! హాయిగా మ్యూజియం చూసేవు కదా! సినిమా కూడా చూసెయ్యి సరదాగా యివ్వేళ: రేపేమో ఎగ్జిబిషన్. యింకా వెంకటేశ్వరస్వామి గుడి వగైరా చూసెయ్యి" అన్నాడు దేవదాసు లాగ నవ్వి

"ఏమండీ ఏమిటా ధోరణి? భోజనం చేసేరా లేదా? యింకా? వంట్లో ఎట్లావుంది? ఈ పాడు సినిమా ప్రోగ్రాం లేకపోతే వెంటనే యింటికి వచ్చేసేదాన్ని. బావగారు ఎడ్వాన్సుగా టికెట్లు కూడా తెచ్చేసేరు." అంది నొచ్చుకుంటూ.

శ్రీమతి కనక యిప్పుడు యింటికి వచ్చిందంటే మనం యింట్లోనే దుకాణం పెట్టిన సంగతి తెల్సిపోతుంది. ఇక జీవితాంతం దెప్పుతూనే వుంటుంది. కొంచెం గాభరా పుట్టింది.

"నువ్వేం ఖంగారు పడకు. నేను నిక్షేపంలాగా వున్నాను. ఇదేదో నవల మొదలెట్టి ఆ మూడ్‌లోకి పోయి భోజనం చెయ్యలేదు. ఇప్పుడు వెళ్ళి చేస్తానుగాని, నువ్వు మాత్రం తొందరపడి రావద్దు. తెల్సిందా? రేపో, ఎల్లుండో నెమ్మదిగా వీలు చూసుకుని రా. అర్థమయ్యిందా? తొందరపడి మాత్రం వచ్చేయ్యకు."






"ఏమిటో మీ మాటలు వింటూంటే నాకు భయంగావుంది తొమ్మిది దాటినా భోజనం చెయ్యకుండా ఏం రాతండీ అది. పెందరాడే భోంచేసి కూర్చుని రాసుకోక. నేను వక్క రోజు యింట్లో లేకపోతే—"

"ఇక్కడ యిప్పుడేం మునిగిపోలేదు. నేను నవల రాసుకుంటూ భోజనం కొంచెం ఆలస్యం చేసేనంతే ఇప్పుడే వెళ్తున్నా. నువ్వుమాత్రం తొందరపడి రావద్దు. తెల్సిందా. ఫోన్ పెట్టేస్తున్నా" అన్నాను.

"ఉండండి ఏమిటా తొందర: భోజనానికి ఏమైనా కూరా, నారా చేసుకున్నారా లేక వట్టి మజ్జిగా, ఆవకాయేనా?"

"అన్నీ చేసుకున్నాం గాని. నా నవల మూడ్ పాడయిపోతోంది ఫోన్ పెట్టేస్తా."

"సరే మీరు ముందు భోంచేసి, ఆ తర్వాత రాసుకోండి. నేను సినిమా అయిపోగానే ఇంటికి వచ్చేస్తున్నా .... నా మనస్సేం బాగా లేదు....అక్కడ మీరెట్లా వున్నారో ఏమిటోనని నాకు మహా బాధగా వుంది".

"నా వంట్లో బ్రహ్మాండంగా వుంది. నువ్వేం తొందరపడి రావక్కర్లేదు. అంతగా కావాలనుకుంటే రేపు వచ్చి చూసి వెళ్ళు. రాత్రి వంటరిగా నువ్వు రావడం అట్టే మంచిదికాదు. అసలే రోజులు బాగాలేవు."

"మరేం భయంలేదు" బావగారు కార్లో తీసుకొచ్చి యింటిదగ్గర దిగబెట్టి వెళతానంటున్నారు. అంతగా కావాలనుకుంటే ప్రొద్దున్నే నేను యిక్కడకు వచ్చేస్తాను "


ప్రొద్దున్నే వెళ్ళిపోయే మనిషి అంత అర్జంటుగా యిక్కడికి రావడం ఎందుకో నాకేం బోధపడలేదు. ఆడవాళ్ళకు సిక్త్సెన్సు వుందంటారు. నిజమే కాబోలు. ఆవలించకుండానే పేగులులెక్కబెట్టడమంటే యిదే అయి వుంటుంది. అనుమానం ఆవహించిన ఆడవాళ్ళతో ఆర్గ్యూ చేసి గెలవలేం అని నిర్ణయించుకుని "సరే నీ యిష్టం" అని ఫోన్ పెట్టేసేను.

ఆవిడగారు వచ్చే సరికి యిల్లంతా శుభ్రంగా వుంచాలి. లేకపోతే వక్కరోజు యింట్లో లేకపోతే యిల్లంతా నానా మంగళం చేసిపెట్టేసేరు అని దెప్పి పొడుస్తుంది.

తేలిపోయే కళ్ళతో, వళం తప్పే మనస్సుతో, జాగ్రత్తగా యిల్లంతా కలియ

మీ చర్మాన్ని రసాయనిక లోషన్ల కరుకుదనానికి పాలుచేయడం సరియైనది కాదు.

**మీ చర్మంతో కొత్త పాయిజ్ హెర్బల్ స్కిన్ లోషన్ కలియనియ్యండి.**



# గాథావళి

అబ్బూరి వరప్రసాదరావుగారు ఆంధ్ర నాటక రంగంలో అనతికాలంలో ఎంత ఎత్తుకు ఎదిగినాడో అంత త్వరలో ఆరిపోయిన అమరజీవి. "అబ్బూరి బ్రదర్స్" పేరిట నాటక సమాజాన్ని స్థాపించి పులిపాటి, మాధవపెద్ది, స్థానం మొదలైన ఉద్దండులను తీసుకొంటూ ప్రఖ్యాతమైన

## అబ్బూరి సమయస్ఫూర్తి-1

"కురుక్షేత్రం"లో కృష్ణుడుగా, అఖిలాంధ్ర దేశంలో అఖండమైన కీర్తి పొందారు. వారితో నాకు కలిగిన చిన్న అనుభవం:

కొల్లివర గ్రామంలో "కురుక్షేత్రం" ప్రదర్శించాలి. (నేను నటుడిన్ని కాను.) రాత్రి 10 గంటల వరకు భీమునిపాత్రధారి రాలేదు. ప్రేక్షకులలో అలజడి ప్రారంభమైంది. అప్పుడు అబ్బూరి నన్ను భీముని పాత్ర వెయ్యమన్నాడు. "నాకా పోర్షను రాదు



గదా" అన్నాను. "నీవు రంగు వేయించుకోవోయి" అని ఆర్డరు వేసాడు. నాకు వేషము వేయడమైనది. నాటకం ప్రారంభమైనది. నేను అద్దంలో చూసుకొన్నాను. నా రూపే మారిపోయింది. పెద్ద మీసాలు. మెడలో పూసలు. చేతిలో గద. నాకు అయోమయమైంది. కాళ్ళు వణుకుతున్నాయి. కృష్ణ పరమాత్మగా అబ్బూరి వచ్చి నా భుజము పై చెయ్యి వేసి. "ఎందుకయ్యా భయపడతావు. నేనున్నాను చక్రం తిప్పడానికి" అని ధైర్యము చెప్పి "బావా అను చాలు" అన్నాడు.

నాకు ఆ గండం రానే వచ్చింది. ఎక్కడలేని ధైర్యము తెచ్చుకొని గద విసురుగా తిప్పి "బావా" అని గట్టిగా అన్నాను. వెంటనే అబ్బూరి అందుకుని నేను చెప్పవలసిన డైలాగులు తానే చెప్పి "నీ అభిప్రాయం అదే కదా" అంటూ ఆవేశం తెచ్చుకోవద్దంటూ నన్ను భుజం తట్టి కూర్చుండపెట్టాడు ఈ రహస్యం కృష్ణుడుగా వేసిన అబ్బూరి, నేను తప్ప ప్రేక్షకులెవ్వరూ పసికట్టలేకపోయారు.

—పి. చలపతిశాస్త్రి

---

చూసేను. టేబులుమీద యింకా పకోడీ, కారపు బూంది మిగిలి వున్నాయి. వాటిని పొట్లాలతో సహా భద్రంగా అవతల పారెయ్యాలి తర్వాత. ముందు యీ ఖాళీ గ్లాసులు సీసా, వగైరాల సంగతి చూడాలి అనుకుంటూ వాటిని కడిగి భద్రం చేసి నేల పైన పడివున్న తినుబండారం నలుసుల్ని తుడిచేసి, మరో మూల నేలపైన పొర్లుతున్నగుడ్డల్ని దండెంమీద వెయ్యబోతూ వాటిని పరిశీలించేసరికి, అవి మా శ్రీమతి చీర, జాకెట్, లంగాలు మగవాళ్ళు ఎక్కడి వక్కడ పారేస్తారని వందసార్లు యీసడించుకునే శ్రీమతికూడా యిట్లా బట్టలు విడిచేసి ఎక్కడ పడితే అక్కడ పడెయ్యడంచూస్తే నా వళ్ళు మండిపోయింది. కానీ, యింటికి రాగానే ఈ పాయింట్ లేవదీసి వుతికి ఆరెయ్యాలి అనుకుని, వాటిని దండెంపైన ఓ మూలగా పడేసి, వంటింటిని ఓసారి చెక్‌చేసి అంట్ల గిన్నెలు అన్నీ పని మనిషి కోసం ఓ మూలగా పడేసి, వళ్ళు తూలిపోతూ వుండటంతో, ఏమీ తినకుండా నోటిని మాత్రం బాగా శుభ్రం చేసుకుని, యింత మజ్జిగ తాగి, వంటింటి తలుపు మూసి, ఎట్లాగో పక్క మీదకొచ్చి పడ్డాను. చలి గజ గజ లాడిస్తోంటే దుప్పటిని మరింత గట్టిగా బిగించి, కళ్ళు మూసుకుని పడుకున్నాను.

[ఇక్కడ కట్‌చేసి మా శ్రీమతి దుప్పటిలో దాక్కుని, పగలబడి వచ్చే నవ్వును ఆపుకోడానికి విశ్వ ప్రయత్నం చేసే ధ్వనులు చేస్తున్న దృశ్యం దగ్గరకు వెళ్దాము.]

నా వెర్రి వేషాలకు కోపగించుకోవలసిన శాంతి, కోపగించుకోకుండా నవ్వుతూండడం చూసి సంతోషించక నేను కోపం తెచ్చుకోవడం మూర్ఖంగానే కన్పించింది. శాంతి అమాయకత్వం ముందు నా కోపం నీరుకారిపోయింది.

దుప్పటిలోని శాంతి చుట్టూ రెండు చేతులూ పోనిచ్చి, "అయామ్ సారీ, శాంతా!" అన్నాను మృదువుగా.

"ఊః పడుకోండిక." అంటూ గొణిగింది. నవ్వు చప్పబడిపోగా.

"నిజంగానే శాంతీ.... అయామ్ రియల్లీ సారీ" అంటూనే ఆ పక్కగానే చోటు చేసుకుని నడుం వాల్చేసేను.

"ఆలస్యంగా వచ్చినందుకు నేను కూడా సారీయే" అంటూ దుప్పటిలోని శాంతి అటు తిరిగి పడుకుంది.

నెమ్మదిగా శ్రీమతి కప్పుకున్న దుప్పటిని తొలగించి, భుజంపైన ప్రేమతో మృదువుగా తాకుతూ, ఆదర్శ ప్రేమకోసం మగవాడు వ్యర్థంగా ఎట్లా అన్వేషిస్తాడో, ఆడవాళ్ళు అతని అన్వేషణను, ఆరాటాన్ని గుర్తించక ఎన్ని అవస్థలు పడతారో, పెడతారో ఉపన్యాసం యివ్వసాగించేను.

"అబ్బ! మాడవస్తోంది. ఏమిటీ సొద! పడుకోకుండాను. తెల్లారేలేచి అంట్లన్ని నేనే తోముకు చావాలి—పనిమనిషి కూడా రాదు—సెలవిచ్చేసేను." అన్నది.

"అయితే నువ్వు మీ చెల్లెలిగారింటికి వెళ్ళట్లేదా.... వెళ్ళనే వెళ్ళవా?" అన్నాను, మరింత దగ్గరకు జరుగుతూ.

"ఎక్కడికీ వెళ్ళట్లేదు. మాట్లాడక పడుకోండిక" అన్నది మందలింపుగా

"అయితే నన్ను నిజంగా క్షమించేసేనన్నమాట" అన్నాను ప్రేమతో అతుక్కుపోతూ.

శ్రీమతి నవ్వేస్తూ, "ఇన్నాళ్ళూ మిమ్మల్ని నటరాస్కెలు అనుకున్నాను. మీరు నటరాస్కెలూ కాదు, నటస్కాండ్రలూ కాదు. మీరు వట్టి—వట్టి" విరగబడి నవ్వుతూంది— వాక్యం పూర్తి చెయ్యకుండా.

"ఊః అదీ చెప్పు—నేను వట్టి...."

"ఒట్టి నట బఫూన్" అనేసింది. నా మొహాన్ని తన మొహం దగ్గరగా లాక్కుంటూ.

✱

---

## (అ) భేదం

"రాజకీయం అంటేనే
రంకు, బొంకు!"
బాగానే వుంది

బద్దలు కొట్టిన కుండపెంకు.
"అది మనందరి రక్తం పంచుకుపుట్టిన
ఏకైక గారాల పుత్రిక" అంటాన్నేను
ఇప్పుడేం చేద్దాం—
ఆ పెంకు కడుపులో దింపుకుందామా?

—పైడిశ్రీ